క్లుప్తంగా

పిచ్చికుక్కల స్వైరవిహారం

సీతానగరం: మండలంలోని పెదబోగిలిలో గొర్రెలు, మేకల మందలపై పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని పశుసంవర్థక శాఖ ఎ.డి సీహెచ్ దీనకుమార్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, 15 రోజులుగా పిచ్చికుక్కల దాడిలో 8 గొర్రెలు, మేకలు గాయపడ్డాయన్నారు. మూగజీవాలకు వైద్యసేవలు అందించామని తెలిపారు. పెంపకందారులు అప్రమత్తంగా ఉంటూ మూగజీవాలను కాపాడుకోవాలని సూచించారు.

సమయపాలన తప్పనిసరి

● మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్


మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

పార్వతీపురం టౌన్: మున్సిపల్ కార్యాలయ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ కోన శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన విలేకరుతో మాట్లాడుతూ.. బెలగాం ప్రాంతంలోని ఎనిమిదో సచివాలయం ఉద్యోగులు గత శనివారం సమయ పాలన పాటించకపోవడంతో షోకాజ్ నోటీసులు జారీ చేసి వివరణ కోరామన్నారు. అయితే ఉద్యోగుల నుంచి సరైన సమాధానం రాకపోవంతో ఈ నెల వేతనాలు నిలిపివేయనున్నట్లు చెప్పారు. సచివాలయాల సిబ్బంది విధి నిర్వహణలో భాగంగా బయటకు వెళ్లాల్సి వస్తే విధిగా మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. అలాగే ఆయా వార్డు పరిధిలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, అనుమతులు లేని భవన నిర్మాణాలపై కార్యదర్శులు దృష్టి సారించి, సమస్యలను మున్సిపల్ అధికారులకు తెలియజేయాలన్నారు. పలు సచివాలయాలలో సిబ్బంది యూనిఫారం వేసుకోకుండా విధులకు హాజరవుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. యూనిఫారం వేయకపోతే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ


మాజీ సర్పంచ్ లంక లక్ష్మిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: మండలంలోని పెదబోగిలి మేజరు పంచాయతీ మాజీ సర్పంచ్ లంక లక్ష్మి కుటుంబాన్ని ఎమ్మెల్యే అలజంగి జోగారావు సోమవారం పరామర్శించి ఓదార్చారు. లక్ష్మి భర్త మాజీ సర్పంచ్ రాములు ఆదివారం ఉదయం బెంగుళూరులో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన మృతదేహాన్ని గ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. పరామర్శలో పార్టీ మండల అధ్యక్షుడు బి. చిట్టిరాజు, పార్టీ సీనియర్ నాయకులు ఆర్వీ పార్థసారథి, పి.రామారావు, బి.గౌరునాయుడు, బి.రమణ, చిన్నారావు, మజ్జి శేఖర్, తదితరులు న్నారు.

ఆర్‌బీకేలకు చేరుతున్న ఎరువులు


అన్‌లోడ్ చేస్తున్న ఎరువులు, విత్తనాలు

సీతానగరం: మండలంలోని ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువులు, విత్తనాలు చేరుతున్నాయి. రైతులకు కావాల్సిన వరి, పచ్చిరొట్ట విత్తనాలను రాయితీపై అందజేస్తున్నట్లు ఏఓ ఎస్. అవినాష్ తెలిపారు. అలాగే చెరకు పంటకు కావాల్సిన విత్తనాలు కూడా సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ప్రైవేట్ డీలర్ల వద్ద కూడా ఎరువులు ఉన్నాయని, రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

తోణాంలో పోలీస్ తనిఖీలు


తోణాం గ్రామంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

సాలూరు రూరల్ : మండలంలోని తోణాం గ్రామంలో పోలీసులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జూన్ 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల లెక్కింపు ఉన్న నేపథ్యంలో గ్రామాల్లోని పరిస్థితులను అంచనా వేస్తున్నారు. ఈక్రమంలో గ్రామంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ బాలకృష్ణ మాట్లాడుతూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. ఎవ్వరూ గొడవలకు పాల్పడకూడదని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటరమణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పార్వతీపురం టౌన్: పట్టణంలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తవలస ఎస్ఎస్‌లో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

వైద్యశాఖలో ఉద్యోగాల జాతర

- ఐదేళ్లలో రెండు వేల ఉద్యోగాల భర్తీ
- పలువురికి ఉద్యోగోన్నతి
- పూర్తి స్థాయిలో సిబ్బంది ఉండడంతో మెరుగైన వైద్యసేవలు


ఫీవర్ సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

పార్వతీపురం టౌన్: వైద్యశాఖలో ఉద్యోగాల భర్తీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతోంది. కొత్తగా క్రియేట్ చేసిన పోస్టులతో పాటు పదవీ విరమణలతో ఖాళీ అయిన పోస్టులను సైతం ఎప్పటికప్పుడు భర్తీ చేస్తున్నారు. దీంతో వరుస నోటిఫికేషన్లతో వైద్యశాఖలో ఉద్యోగాల జాతర నెలకొంది. ఐదేళ్లలో రెండు వేల మందికిపైగా ఉద్యోగులను ప్రభుత్వం వైద్యశాఖలో నియమించింది. వీటిలో 80 శాతం కొత్తగా క్రియేట్ చేసిన పోస్టులే కావడం విశేషం. పార్వతీపురం మన్యం జిల్లాలో అన్ని ప్రధాన ఆస్పత్రులు, పీహెచ్‌సీల పరిధిలోనూ పలు పోస్టులను భర్తీ చేశారు.

నిరంతరం ప్రక్రియ..

ఒకప్పుడు పదవీ విరమణ చేసినా, కాంట్రాక్ట్ ఉద్యోగులు మానేసినా వాటిని భర్తీ చేసేందుకు ఏళ్ల సమయం పట్టేది. దీంతో అరకొర సిబ్బందితో వైద్య సేవలకు తీవ్ర ఆటంకం కలిగేది. ఈ పరిస్థితిని గమనించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైద్యశాఖలో నిరంతరం నియామక ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. అందుకు సంబంధించి ఆదేశాలు జారీ చేయడంతో ఎప్పుడు ఖాళీ అయిన పోస్టులను అప్పుడే భర్తీ చేస్తున్నారు. పూర్తిస్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉండటంతో రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నారు.

నియామకాల్లో పారదర్శకత..

గత ప్రభుత్వ హయాంలో సిఫార్సులతోనే ఉద్యోగాలు ఇచ్చేవారు. ఆ సమయంలో ముడుపులు కూడా పెద్ద మొత్తంలో డిమాండ్ చేశారు. ఇప్పుడు పరిస్థితి మారింది. డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ఏర్పాటు చేసి, ప్రతి నియామకాన్ని పారదర్శకంగా చేపడుతున్నారు. మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారు. ఎలాంటి అనుమానాలకు తావులేకుండా మెరిట్ లిస్టులను ఆన్‌లైన్‌లో పొందుప రుస్తున్నారు.

రోగులకు మెరుగైన సేవలు..

ఒకప్పుడు సిబ్బంది కొరతతో రోగులకు అరకొర వైద్య సేవలు అందేవి. ప్రస్తుతం పరిస్థితి మారింది. పూర్తిస్థాయిలో సిబ్బంది ఉండటంతో ఎలాంటి లోపాలు తలెత్తకుండా సేవలు అందిస్తున్నారు. గతంలో పార్వతీపురం జిల్లాలో కేవలం 40మంది స్టాఫ్ నర్సులు ఉండేవారు. ఇప్పుడు ఆ సంఖ్య 99కి చేరింది. కొత్తగా 59 స్టాఫ్ నర్సు పోస్టులను క్రియేట్ చేసి నియామకాలు చేపట్టారు. జిల్లాలో 59 మంది వైద్యులు విధులు నిర్వహించేవారు. ఇప్పుడు ఆ సంఖ్య 83కి చేరింది. జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు ఉండేలా చర్యలు తీసుకున్నారు.

ఎప్పటి ఖాళీలు అప్పుడే భర్తీ..



వైద్యశాఖలో నియామకాల ప్రక్రియ నిరంతరం కొనసాగుతోంది.జిలా ఏర్పాటుతో వైద్యారోగ్య శాఖలో ఎప్పటికప్పుడు ఖాళీలను భర్తీ చేస్తున్నాం. జిల్లాలో గల అన్ని పీహెచ్‌సీలలో ఇద్దరు చొప్పున వైద్యులను నియమించి ఫ్యామిలీ డాక్టర్ విధానం, పీహెచ్‌సీలలో పూర్తి స్థాయిలో వైద్యాన్ని అందించగలుగుతున్నాం. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, స్టాఫ్‌నర్సులు, ఇతర సిబ్బందిని నియమించాం.

–డాక్టర్ వినోద్, జిల్లా హెల్త్ ప్రోగ్రాం అధికారి, పార్వతీపురం మన్యం

మంచి పరిణామం..



వైద్యశాఖలో ఒక్కఖాళీ కూడా లేకుండా ఉద్యోగాలు భర్తీ చేయడం మంచి పరిణామం. ఎప్పటికప్పుడు అధికారుల నుంచి ఖాళీల వివరాలను తెలుసుకుని, నోటిఫికేషన్లు ఇస్తూ ఉద్యోగ నియామకాలు చేపడుతున్నారు. దీంతో పూర్తిస్థాయిలో ఉద్యోగులు అందుబాటులో ఉండటంతో రోగులకు సకాలంలో సేవలు అందించగలుగుతున్నారు. ఒకప్పుడు ఇద్దరు, ముగ్గురు చేసే పనిని ఒకరు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

– డాక్టర్ విజయ పార్వతి, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి, పార్వతీపురం మన్యం

జీతాల సమస్య పరిష్కరించాలి..


మేనేజర్‌తో మాట్లాడుతున్న నాయకులు

సాలూరు: బకాయి జీతాలు చెల్లించకుంటే వచ్చే నెల 6 తర్వాత నిరవధిక సమ్మెకు వెళ్తామని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ కమిటీ సభ్యులు స్పష్టం చేసారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం మేనేజర్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, బకాయి జీతాలు చెల్లించడంతో పాటు మరణించిన కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రవి, సామయ్య, స్వప్న, రాముడు, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ రవికుమార్

● సీఐ రవికుమార్

పార్వతీపురం టౌన్: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ రవికుమార్ అన్నారు. మండలంలోని గోపాలపురంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలు సహకరించిన విధంగానే .. ఓట్ల లెక్కింపు అనంతరం కూడా సమన్వయంతో ఉండాలన్నారు. జూన్ 4న లెక్కింపు ఉన్న నేపథ్యంలో ఎవరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, అనుమతులు లేకుండా ర్యాలీలు నిర్వహించినా, వార్డుల్లో పాత కక్షలు పెట్టుకుని అల్లర్లకు పాల్పడినా చట్టపరంగా శిక్షిస్తామని చెప్పారు.

పైనాపిల్ సేకరణలో బిజీబిజీ

సీతంపేట: పైనాపిల్ సేకరణలో గిరిజనులు నిమగ్నమయ్యారు. ఈ సీజన్‌లో కొండపోడులో విస్తృతంగా పైనాపిల్ పండుతుంది. పురుషులు, మహిళలు అందరూ పంట సేకరణలో బిజీగా ఉన్నారు. సీతంపేట ఏజెన్సీలో దాదాపు 5 వేల హెక్టార్లలో పంట సాగులో ఉంది. కోసిన పంటను వారపు సంతలకు తీసుకువెళ్లి విక్రయిస్తారు. ప్రస్తుతం ఒక్కో పండు రూ.15 నుంచి రూ.20 వరకు ధర పలుకుతోంది. సీజన్ ఆఖరు వరకు ఇవే ధరలు ఉంటే మంచి ఆదాయం వస్తుందని గిరిజనులు అంటున్నారు.


పైనాపిల్స్‌ను బుట్టలతో ఇళ్లకు తీసుకువెళ్తున్న గిరిజన మహిళలు

క్యాంపస్ ఇంటర్వ్యూలో 10 మంది ఎంపిక



జియ్యమ్మవలస: చినమేరంగి ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు సోమవారం నిర్వహించారు. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ పి.నాగరాణి ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ ఉద్యోగాలకు 10 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల సిబ్బంది తెలిపా రు. ఈఈఈ నుంచి సీహెచ్ శివసాయి, మెకానికల్ విభాగం నుంచి టి.వివేక్, వై.గణేష్, ఎస్.వినయ్, వై.హేమసుందరరావు, జి.చంద్రశేఖర్, జి.వెంకటసాయి పవన్, బి.తేజ, ఎం.మహేష్, పి.భవానీ ప్రసాద్‌లు ఎంపికైన వారిలో ఉన్నారు. వీరందరికీ చినమేరంగి ఎస్ఐ చిన్నంనాయుడు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందజేస్తున్న ఎస్ఐ చిన్నంనాయుడు

డిగ్రీ ఫలితాల్లో విద్యార్థి ప్రతిభ

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి తాడంగి వినయ్ ఇటీవల విడుదలైన డిగ్రీ ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచాడు. 2021–24 బ్యాచ్‌కు చెందిన వినయ్ బీఏ(బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్)లో 8.54 గ్రేడ్ పాయింట్లు సాధించి, పార్వతీపురం మన్యం జిల్లాలో తృతీయ స్థానంతో నిలిచాడు. ఈ మేరకు అతడిని ప్రిన్సిపాల్ టి.శ్రీవరం, వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య, ఎన్.ఎస్.ఎస్ పీవో బి.త్రినాథ్ తదితరులు అభినందించారు. ఇదే స్ఫూర్తితో ఉన్నత చదువుల్లో కూడా బాగా రాణించాలని ఆకాంక్షించారు.

నేడు మండల సమావేశం

వీరఘట్టం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎంవీబీ సుబ్రహ్మణ్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఈ సమావేశంలో ఎటువంటి అభివృద్ధి పనులపై, ఇతర కార్యక్రమాలపై తీర్మానాలు చేయడం కుదరదన్నారు. ఈ విషయాన్ని ఎంపీటీసీ సభ్యులంతా గమనించాలని సూచించారు. అధికారులు, సభ్యులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: పెద్దమడి గిరిజన బాలుర గురుకుల జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశానికి వచ్చేనెల 10న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ శుభం బన్సల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీలో 26, బైపీసీలో 15, సీఈసీ 23 ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి పాసైన విద్యార్థులు వచ్చేనెల 6లోగా కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

రెవెన్యూ సర్వీసులు సక్రమంగా అందించాలి

పాలకొండ: గ్రామాల్లో రెవెన్యూ సర్వీసులు సక్రమంగా అందించాలని తహసీల్దార్ వరహాలు ఆదేశించారు. మండలంలోని వీఆర్వోలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కారణంగా ఇంత వరకు నిలిచిపోయిన సేవలను వెంటనే పునరుద్ధరించాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులకు కుల, ఆదాయ ధ్రువపత్రాల జారీలో జాప్యం జరగకుండా చూడాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. ప్రభుత్వ భూములు, గనుల రక్షణ చర్యలు చేపట్టాలని, ఇసుక అక్రమ తవ్వకాలపై సమాచారం అందించాలని సూచించారు.

మీసేవా కేంద్రాల పరిశీలన

పాలకొండ: పట్టణంలోని మీసేవా కేంద్రాలను డీఎల్‌డీఓ వీవీ గోపాలకృష్ణ సోమవారం పరిశీలించారు. మీసేవా కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. పక్కాగా చలనా రిజిస్టరు నిర్వహించాలన్నారు.

అందుబాటులో మందులు..

● డీఎంఓ జగన్ మోహనరావు


పెదంకలాం పీహెచ్‌సీలో మందులను పరిశీలిస్తున్న డీఎంఓ జగన్ మోహనరావు

సీతానగరం: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో అన్నిరకాల మందులు, కుక్కకాటుకు వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచామని డీఎంఓ జగన్ మోహనరావు అన్నారు. పెదంకలాం పీహెచ్‌సీని సోమవారం సందర్శించి ఓపీ రిజిస్టర్, మందుల నిల్వలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలకు జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఆస్పత్రులకు వచ్చే వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. పీహెచ్‌సీలు, విలేజ్ క్లినిక్‌ల వద్ద అన్ని రకాల మందులు సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. 104 సిబ్బంది గ్రామాలకు వచ్చినప్పుడు వైద్య పరీక్షలు చేయించుకుని, మందులు పొందాలని సూచించారు. పీహెచ్‌సీ డాక్టర్ రాధాకాంత్, డాక్టర్ ప్రభుదేవ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

20 రోజుల్లో ఆక్రమణలు తొలగిస్తాం

● మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్


కాలువపై ఆక్రమణలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

పార్వతీపురం టౌన్: ఆక్రమణల తొలగింపు పనులు 20 రోజుల్లో పూర్తి చేస్తామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా గల కాలువలపై చోటుచేసుకున్న ఆక్రమణలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణంలోని ప్రధాన రహదారిపై వర్షపునీరు నిల్వ ఉండకుండా మళ్లించేందుకు చర్యలు చేపట్టామన్నారు. కాలువలను ఆక్రమించడం వల్ల రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోతోందని..దీనివల్ల వాహన చోదకులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆక్రమణలను త్వరితగతిన తొలగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం చేయండి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రైతు కూలీ సంఘ సభ్యులు

పార్వతీపురం టౌన్: రైతు కూలీ సంఘ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు ఊయక ముత్యాలు కోరారు. జూన్ 15, 16, 17 తేదీల్లో ఏలూరులో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్లను సోమవారం స్థానిక సంఘ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతులను మోసం చేసి, కార్పొరేట్ శక్తులకు అండగా నిలుస్తోందని ఆరోపించారు. మహాసభలకు ప్రతి ఒక్కరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి దంతులూరి వర్మ, జిల్లా సహాయ కార్యదర్శులు పి. శ్రీనునాయుడు, మోసంగి భాస్కరరావు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గిరిజనుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం


● డాక్టర్ కౌశిక్


అదారు గిరిజన గ్రామంలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ కౌశిక్, తదితరులు

పార్వతీపురం టౌన్: గిరిజనుల ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని డాక్టర్ కౌశిక్ అన్నారు. అదారు గిరిజన గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 73 మందిని పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం డాక్టర్ కౌశిక్ మాట్లాడుతూ, ఎఫ్‌పీసీ విధానంలో ప్రతి గ్రామంలో నెలకు రెండుసార్లు వైద్యశిబిరాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులు ఉండడం వల్ల ఒకరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో .. మరొకరు ప్రజల వద్దకు వెళ్లి వైద్య సేవలు అందిస్తారన్నారు. దాదాపు 13 రకాల వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. 67 రకాల మందులు, 14 రకాల డయాగ్నోస్టిక్ సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఎనిమిది రకాల రక్త పరీక్షలు నిర్వహించి రోగులకు నెలకు సరిపడా మందులను ఉచితంగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, 104 వాహన సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

గ్రామీణ విద్యార్థులకు అండగా 'అభిలాష'

- అందుబాటులో పోటీ పరీక్షల పుస్తకాలు
- విద్యార్థుల ఇళ్లకే ఇస్తున్న వైనం



అభిలాష గ్రంథాలయం బ్యానర్


అభిలాష గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు

సాలూరు రూరల్ : గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 'అభిలాష గ్రంథాలయాలు' విద్యార్థులకు అండగా నిలుస్తున్నాయి. గ్రామీణ విద్యార్థులకు అవసరమైన పోటీ పరీక్షల పుస్తకాలను ఇళ్లకే ఇవ్వడంతో, ఏకాగ్రతతో చదువుకునే అవకాశం లభిస్తోంది. ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించాక విద్య, వైద్య రంగాలకు ఎనలేని ప్రాధాన్యం ఇచ్చారు. ఇందులోభాగంగా 'నాడు – నేడు'లో భాగంగా విద్యాలయాల రూపురేఖలు మార్చారు. ఈ క్రమంలో డిగ్రీలు పూర్తి చేసి పోటీ పరీక్షల పుస్తకాలు కొనుగోలు చేయలేని గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మేలు చేసేలా సచివాలయాల్లో అభిలాష గ్రంథాలయాలు ఏర్పాటు చేశారు. ఇంటికి తీసుకెళ్లేందుకు పుస్తకాలు ఇస్తుండడంతో విద్యార్థులకు ఈ గ్రంథలయాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

ఆనందంగా ఉంది..



పోటీ పరీక్షలకు సంబంధించిన అన్ని పుస్తకాలు అభిలాష గ్రంథాలయంలో అందుబాటులో ఉండడం ఆనందంగా ఉంది. ఎమ్మెస్సీ జియాలజీ చదివాను. ప్రస్తుతం పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాను. అభిలాష నుంచే పుస్తకాలు తెచ్చుకుని చదువుతున్నాను.

–రెయ్యి గంగ, కొత్తవలస సాలూరు మండలం

ఉపయోగపడుతోంది..



సచివాలయాల్లో ఏర్పాటు చేసిన అభిలాష గ్రంథాలయం మాలాంటి పేద విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. నేను ఎంఏ ఎకనామిక్స్ చదివాను. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు చేలా ఖరీదైనవి. కొనుగోలు చేసి చదివుకునే స్తోమత లేదు. అభిలాష గ్రంథాలయంలోని పుస్తకాలను ఇంటికి తీసుకువచ్చి చదువుకుంటున్నాను.

–పోరాపు శాంతికుమారి, కొత్తవలస, సాలూరు మండలం

కురుపాంలో కార్డన్ సెర్చ్


సీజ్ చేసిన వాహనాలతో పోలీస్ సిబ్బంది

కురుపాం: మండల కేంద్రంలోని రెల్లి, దొనక, దప్పు వీధుల్లో పోలీసులు సోమవారం తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేని 10 వాహనాలను సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు వాహన తనిఖీలు, కార్డన్ సెర్చ్‌లు ముమ్మరం చేశామని ఎస్ఐ షణ్ముఖరావు తెలిపారు. కార్డన్ సెర్చ్‌లో పాల్గొన్న వారిలో నీలకంఠాపురం ఎస్ఐ నీలకంఠావు తదితరులు ఉన్నారు.

కొండవీధిలో కార్డన్ సెర్చ్


కొండవీధిలో సోదాలు చేస్తున్న సీఐ చంద్రమౌళి, పోలీసులు

వీరఘట్టం: స్థానిక మేజరు పంచాయతీలోని కొండవీధిలో సోమవారం తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పాలకొండ సీఐ ఎం.చంద్రమౌళి, వీరఘట్టం, పాలకొండ ఎస్సైలు షేక్ ఫక్రుద్దీన్, అనీల్‌కుమార్‌లతో పాటు 40 మంది పోలీసు సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు. వీధిలో అడుగడుగునా జల్లెడపడుతూ సోదాలు చేశారు. సరైన పత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు.